సాక్షి
వైఎస్సార్ జిల్లా
శనివారం । 26 । ఆగస్టు । 2023



రోడ్డు ప్రమాదంలో మామ,అల్లుడి దుర్మరణం

ఎర్రగుంట్ల-ప్రొద్దుటూరు రోడ్డుపై గురువారం జరిగిన రోడ్డుప్రమాదంలో మామ, అల్లుడు మరణించారు. -8లో



పెళ్లికి క్యాటరింగ్ చేసేందుకు వెళ్తూ..

వివాహానికి క్యాటరింగ్ చేసేందుకు నెల్లూరు నుంచి వస్తూ రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మహిళలు దుర్మరణం చెందారు. -8లో

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
36.2/26.9

జిల్లాలో శుక్రవారం 26.9 - 36.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 18.5 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. - కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

5న జెడ్పీ సర్వసభ్య సమావేశం

కడప సెవెన్‌రోడ్స్: వైఎస్సార్ ఉమ్మడి జిల్లా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం సెప్టెంబరు 5వ తేదీ ఉదయం 9.00 గంటలకు జెడ్పీ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు సీఈఓ సుధాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్పీ ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు, అధికారులు ఆ రోజు ఉదయం 9.00 గంటలకే జెడ్పీ సమావేశ మందిరానికి చేరుకోవాలని సూచించారు.

వైఎస్సార్ సీపీ నుంచి సస్పెన్షన్

రాయచోటి: పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడటంతో పాటు క్రమశిక్షణ ఉల్లంఘించడంతో రాజంపేట మార్కెట్ యార్డు చైర్మన్ పోలి రామసుబ్బమ్మ, వైస్ చైర్మన్ పోలి వెంకట సుబ్బారెడ్డిలను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాయచోటి అర్బన్: అన్నమయ్య జిల్లా ఐసీడీఎస్ పరిధిలో ఖాళీగా ఉన్న పోస్టుల భర్తీకి అర్హులు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ గిరీషా పీయస్ ఒక ప్రకటనలో కోరారు. జిల్లా కో-ఆర్డినేటర్, ప్రాజెక్టు అసిస్టెంట్, బ్లాక్ కో- ఆర్డినేటర్ పోస్టులు ఒక్కొక్కటి చొప్పున కాంట్రాక్టు పద్ధతిన భర్తీ చేస్తామన్నారు. వీరికి వరుసగా నెలకు రూ.30 వేలు, రూ.18 వేలు, రూ.20వేలు చొప్పున వేతనాలుంటాయన్నారు. వివరాలకు సంజీవనగర్ కాలనీలోని జిల్లా మహిళ, శిశుసంక్షేమ, సాధికారత కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు..

రాజంపేట టౌన్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒకేషనల్ గ్రూపునకు సంబంధించి అకౌంటింగ్ అండ్ ట్యాక్సేషన్ (ఏఅండ్‌టీ) కోర్సును బోధించేందుకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ ఎస్వీ.రమణరాజు శుక్రవారం తెలిపారు. అభ్యర్థులు ఈనెల 29వ తేదీలోపు కళాశాలలోని కార్యాలయ పనిదినాల్లో దరఖాస్తులను నేరుగా అందచేయాలని తెలిపారు. 30వ తేదీ ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు.

బాధ్యతల స్వీకరణ

ప్రొద్దుటూరు కల్చరల్ : ఏపీ అసెంబ్లీ బీసీ వెల్ఫేర్ కమిటీ చైర్మన్‌గా ఎమ్మెల్సీ ఆర్.రమేష్ యాదవ్ శుక్రవారం వెలగపూడిలోని అసెంబ్లీ కమిటీ హాల్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అధికారులు, కమిటీ సభ్యులు అభినందించారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. కాగా, కమిటీ సభ్యులతో నిర్వహించిన మొదటి సమావేశంలో పలు సమస్యలపై చర్చించారు. అక్టోబర్‌లో కడప, చిత్తూరు జిల్లాల్లో రాష్ట్ర బీసీ వెల్ఫేర్ కమిటీ పర్యటన ఉంటుందని తెలిపారు.

బీఈడీ ఫలితాలు విడుదల

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం పరిధిలోని బీఈడీ కళాశాలల నాలుగో సెమిస్టర్ ఫలితాలను వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎన్. ఈశ్వరరెడ్డితో కలిసి శుక్రవారం విడుదల చేశారు. జూలైలో నిర్వహించిన పరీక్షలకు 2,367 మంది విద్యార్థులు హాజరుకాగా 2,294 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు.

జవహర్ నవోదయ గడువు పెంపు

మదనపల్లె సిటీ: మదనపల్లె పట్టణం చిత్తూరు రోడ్డులోని జవహర్ నవోదయ విద్యాలయంలో 2024-25 విద్యా సంవత్సరానికి గాను 6వ తరగతిలో ప్రవేశానికి ఈ నెల 31 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునేందుకు మరోసారి గడువు పెంచినట్లు ప్రిన్సిపాల్ గోవిందరావు తెలిపారు. అదే విధంగా సెప్టెంబర్ 1,2 తేదీల్లో దరఖాస్తుల్లో వివరాలు సవరించుకునేందుకు అవకాశం కల్పించినట్లు పేర్కొన్నారు.

స్టూడెంట్ గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు



వెబ్‌సైట్‌ను ప్రారంభిస్తున్న వీసీ ఆచార్య చింతా సుధాకర్, అధికారులు

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం అనుబంధ పోస్టు గ్రాడ్యుయేషన్, డిగ్రీ విద్యార్థుల సమస్యలను ఎప్పటికప్పుడు అధికారుల దృష్టికి తీసుకువచ్చే స్వేచ్ఛను కల్పిస్తూ స్టూడెంట్ గ్రీవెన్స్ రిడ్రెసల్ (ఎస్.జి.ఆర్.) సెల్‌ను ఏర్పాటు చేసినట్లు వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ పేర్కొన్నారు. శుక్రవారం విశ్వవిద్యాలయంలో ఎస్.జి.ఆర్. సెల్‌కు సంబంధించిన వెబ్‌సైట్‌ను వీసీ ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ విద్యార్థులు వారి సర్టిఫికెట్లు, మార్కుల జాబితాలు, అకడమిక్‌గా, వ్యక్తిగతంగా ఎదుర్కొంటున్న సమస్యలు గ్రీవెన్స్‌సెల్ ద్వారా ఆన్‌లైన్‌లోనే నమోదు చేసుకోవచ్చన్నారు. వీటిని సెల్ చైర్మన్ ఆచార్య ఎ. చంద్రశేఖర్, కమిటీ సభ్యులు సంబంధిత విభాగాల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారాన్ని చూపుతారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి, ఐటీ సెల్ డైరెక్టర్ ఆచార్య ఎం.వి.శంకర్ పాల్గొన్నారు.

నేస్తం.. చేనేతకు వరం

- ఐదు విడతలుగా వైఎస్సార్ నేతన్న నేస్తం అందజేత
- ఒక్కో చేనేత కుటుంబానికి ఏడాదికి రూ.24 వేల సాయం
- ఐదు విడతలుగా 49,853 మందికి లబ్ధి



చీర నేస్తున్న కార్మికురాలు



కడప కోటిరెడ్డిసర్కిల్: పోగు పోగు జతచేసి చీరలు నేస్తూ నైపుణ్యం చాటుతున్న చేనేతలకు సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్లుగా ఆర్థిక చేయూత ఇస్తున్నారు. కోవిడ్ కష్టకాలంలోనూ సాయం అందజేసి అండగా నిలిచారు. మగ్గం కలిగిన ప్రతి చేనేత సొంతంగా పరికరాలు సమకూర్చుకునేందుకు వైఎస్సార్ నేతన్న నేస్తం కింద ఏడాదికి రూ. 24 వేల చొప్పున సాయాన్ని అందజేస్తున్నారు. కేంద్రంపై ఒత్తిడి తెచ్చి అప్పటివరకు నూలుపై ఉన్న 9.2 శాతం ఎక్సైజ్ డ్యూటీని రద్దు చేయించి ఆర్థిక భారం తగ్గిస్తున్నారు. నూలు, రంగు, రసాయనాలపై పది శాతం రాయితీని ప్రకటించి అండగా నిలుస్తున్నారు. చేనేత సహకార సొసైటీలను పునరుద్ధరించి ఆర్థిక వెలుగులు నింపుతున్నారు.

ఐదేళ్లలో 49,853 మందికి లబ్ధి

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టగానే చేనేతల కోసం వైఎస్సార్ నేతన్న నేస్తం పథకాన్ని ప్రవేశపెట్టారు. ఈ పథకం కింద మగ్గం ఉన్న ప్రతి కార్మికుడికి ఏటా రూ.24 వేల చొప్పున వారి బ్యాంకు ఖాతాలకు జమ చేస్తున్నారు. ఈ ఏడాది వైఎస్సార్ జిల్లాలో 9,490 మందికి రూ.22,77,60,000 ఆర్థిక ప్రయోజనం కల్పించారు. ఐదు విడతలుగా అందజేసిన ఈ మొత్తంతో 49,853 మంది లబ్ధి పొందారు. ఇప్పటి వరకు ఒక్కొక్కరికి రూ.1.20 లక్షల చొప్పున సాయం అందింది.

ఆప్కో ద్వారా వస్త్రాల విక్రయం



చేనేతలకు అందిన ప్రభుత్వ సాయంతో చేనేత కార్మికులు నూలు, కొత్త పరికరాలు కొనుగోలు చేశారు. రేయింబవళ్లు కష్టపడి ఆర్థికంగా నిలదొక్కుకున్నారు. ఆప్కోకు ఆర్థిక జవసత్వాలు అందించడమేగాక, నేసిన వస్త్రాలను అక్కడే విక్రయించే వెసలుబాటు ప్రభుత్వం కల్పించింది. ఇప్పటికే జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన, అమ్మ ఒడి, వైఎస్సార్ చేయూత, ఆసరా తదితర సంక్షేమ పథకాలు చేనేత కార్మికుల కుటుంబాలను ఆర్థికంగా ఆదుకుంటున్నాయి. అలాగే 50 సంవత్సరాలు నిండిన చేనేత కార్మికుడికి వైఎస్సార్ పెన్షన్ కానుక అందుతోంది. అన్ని విధాలుగా సాయం చేస్తూ సీఎం వారి జీవితాల్లో ఆనందం నింపుతున్నారు.

ఆర్థికసాయంతో ఆదుకున్నారు



వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం ద్వారా ఐదు విడతలకు సంబంధించి నగదు నా బ్యాంకు ఖాతాలో జమైంది. అది ముడి సరుకు కొనుగోలుకు ఎంతగానో ఉపయోగపడింది. ఆర్థికంగా ఆదుకుంటున్న జగనన్న ఎల్లప్పుడూ చల్లగా ఉండాలి. ఆయనకు ఎప్పటికీ రుణపడి ఉంటాం. - భీమునిపల్లి లక్ష్మి, చేనేత కార్మికురాలు, మైలవరం మండలం

ఏటేటా ఆర్థికసాయం



వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం కింద మాకు ఏటేటా ఆర్థికసాయం అందుతోంది. చేనేత వృత్తి కనుమరుగు అవుతున్న తరుణంలో జగన్‌మోహన్‌రెడ్డి మాకు అండగా నిలిచారు. ఈ పథకాన్ని ఇంత బాగా అమలుచేస్తారని అనుకోలేదు. ఆయనకు మా చేనేత కుటుంబాలన్నీ రుణపడి ఉంటాయి. - చిట్టా కృష్ణవేణి, చేనేత కార్మికురాలు, మాధవరం, సిద్ధవటం మండలం

చేనేత వృత్తిపై నమ్మకం పెరిగింది



గతంలో మా ఉత్పత్తులకు సరైన ప్రోత్సాహం లేకపోవడంతో వస్త్రాలు నేసేందుకు ముందుకు వచ్చే వాళ్లం కాదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక ఆయన ఆదుకుంటారన్న విశ్వాసం కలిగింది. వృత్తిపై నమ్మకం పెరిగింది. అనుకున్నట్లుగానే వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం ద్వారా సీఎం అన్ని విధాలా ఆదుకుంటున్నారు. - వెంకట సుబ్బమ్మ, కన్నెలూరు

మా దేవుడు జగన్‌మోహన్‌రెడ్డి



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మా పాలిట దేవుడు. నేత వృత్తిని నమ్ముకున్న మాకు నేతన్న నేస్తం పథకం ద్వారా ఆదుకుంటున్నారు. ఇప్పటివరకు ఏ ప్రభుత్వం కూడా చేనేత కార్మికులను ఈ స్థాయిలో ఆదుకోలేదు. ఐదు విడతలుగా నా ఖాతాకు వైఎస్సార్ నేతన్న నేస్తం కింద రూ.1.20 లక్షలు జమైంది. - ఈశ్వరయ్య, మైలవరం

ఉపాధ్యాయ పురస్కారాలకు దరఖాస్తులు

కడప ఎడ్యుకేషన్: జిల్లాలోని అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు జిల్లాస్థాయి ఉపాధ్యాయ పురస్కార్-2023కు దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ రాఘవరెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, ఎయిడెడ్, పురపాలక యాజమాన్యాలతో పాటు ఏపీఆర్ఈఐఎస్, ఏపీఎస్ఈఆర్ఈఐఎస్, ఏపీటీడబ్ల్యూఈఐఎస్‌లలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తూ 10 సంవత్సరాలు టీచింగ్ అనుభవం గల అన్ని కేటగిరీలకు చెందిన వారు ఈ అవార్డుకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. kadapadeo.in వెబ్‌సైట్‌లోని నిబంధనలు అనుసరించి అప్లికేషన్‌ను పూరించాలన్నారు. ఈ నెల 29వ తేదీలోపు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో సమర్పించాలని డీఈఓ తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ఎంపికకు కమిటీ ఏర్పాటు

వైవీయూ: సెప్టెంబర్ 5వ తేదీ జాతీయ ఉపాధ్యాయ దినోత్సవ పురస్కరించుకుని విద్యారంగంలో విశేష సేవలందించిన వారికి ప్రతిఏటా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు ఇవ్వడం ఆనవాయితీ. అయితే ఉన్నతవిద్యకు సంబంధించి కడప జోన్-4 పరిధిలోని అధ్యాపకులకు సంబంధించిన దరఖాస్తుల స్క్రూటినీ ప్రక్రియ కోసం కళాశాల విద్య కడప ప్రాంతీయ సంయుక్త సంచాలకులు డా. పి. బాబు 10 అధ్యాపకులతో కమిటీ ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. వీరు వచ్చిన దరఖాస్తులను బోధనకు 60 శాతం (600 స్కోరు), రీసెర్చ్‌కు 20 శాతం (200 స్కోరు), ఎక్స్‌టెన్షన్ అండ్ సపోర్ట్ ఆక్టివిటీస్‌కు 20 శాతం (200 స్కోరు) చొప్పున పరిశీలించి బెస్ట్ టీచర్ అవార్డుకు పంపాల్సి ఉంటుంది. అయితే స్క్రూటినీ ప్రక్రియలో పరిశోధనలకు 20 శాతం మేర వెయిటేజి ఉండగా, పరిశోధనలకు సంబంధం లేని, ఒక్క పబ్లికేషన్, పరిశోధన చేయని అధ్యాపకులకు కమిటీలో చోటు కల్పించారని అధ్యాపక వర్గాలు ఆరోపిస్తున్నాయి. పరిశోధనల పట్ల అవగాహన, అనుభవం లేని వారు ఏ విధంగా పరిశోధన ఫలితాలను పరిగణలోకి తీసుకుని అవార్డులకు సిఫార్సు చేస్తారని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పరిశోధకులకు చోటు కల్పించాలని కోరుతున్నారు. కాగా ఈ విషయమై కడప ఆర్‌జేడీ బాబును ఫోన్ ద్వారా సంప్రదించగా, ఆయన అందుబాటులోకి రాలేదు.

రు.535 కోట్లతో కుప్పానికి రెండు రిజర్వాయర్లు

జలనవరులశాఖ ఈఎన్‌సీ నారాయణరెడ్డి



కుప్పం ఉపకాలువను పరిశీలిస్తున్న ఈఎన్‌సీ నారాయణరెడ్డి

బి.కొత్తకోట (అన్నమయ్యజిల్లా): చిత్తూరుజిల్లా కుప్పం నియోజకవర్గానికి కొత్తగా రెండు రిజర్వాయర్లను ప్రతిపాదించామని జలనవరులశాఖ ఈఎన్‌సీ నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన హంద్రీనీవా ప్రాజెక్టు రెండోదశలో భాగంగా పలమనేరు నియోజకవర్గం నుంచి కుప్పం నియోజకవర్గానికి సాగే పుంగనూరు ఉపకాలువ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. శాంతిపురం, గుడిపల్లె, కుప్పం, వీ.కోట మండలాల్లో జరుగుతున్న పనులను పరిశీలించారు. శాంతిపురం మండలం యామిగానిపల్లె వద్ద 710 ఎంసీఎఫ్‌టీల సామర్థ్యంతో, మాదనపల్లె వద్ద 350 ఎంసీఎఫ్‌టీల సామర్థ్యంతో రిజర్వాయర్లను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించగా రూ.535 కోట్ల వ్యయంతో ప్రతిపాదనలు పంపినట్టు చెప్పారు. ఈఎన్‌సీ ఎత్తిపోతలు, కాలువ పనులను పూర్తిస్థాయిలో పరిశీలించారు. ఇన్వర్ట్ సైఫన్ పనులు, కైగల్ రివర్ వద్ద క్రాసింగ్, కిలోమీటర్ 30.450 నుంచి కిలోమీటర్ 35.07 వరకు కాలువను పరిశీలించారు. శాంతిపురం మండలం గణేష్‌పురం వద్ద పాలారు నదిపై 600 ఎంసీఎఫ్‌ల నీటి నిల్వ సామర్థ్యంతో రిజర్వాయర్ నిర్మాణానికి ప్రతిపాదించిన స్థలాన్ని పరిశీలించారు. ఆదినేపల్లె వద్ద కాలువపై జరుగుతున్న ఎత్తిపోతల పనులను పరిశీలించి సూచనలు చేశారు. కాలువకు సంబంధించిన పూర్తి పనులు అక్టోబర్‌కల్లా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నమయ్యజిల్లా తంబళ్లపల్లె నియోజకవర్గం నుంచి కుప్పం కాలువకు కృష్ణా జలాలు తరలించే సమయంలో ఎలాంటి అవరోధాలు కలగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎక్కడా లీకేజులు లేకుండా చూసుకోవాలని కోరారు. ఆయనవెంట తిరుపతి టీజీపీ సీఈ వెంకటరమణ, మదనపల్లె ఎస్ఈ రాజగోపాల్, డిజైన్స్, క్వాలిటి కంట్రోల్ ఎస్ఈ ఎ.వెంకటరమణయ్య, ఈఈ రమేష్‌బాబు ఉన్నారు.

బుట్టబొమ్మ.. వచ్చిందమ్మా



పూజ హెగ్డేను చూసేందుకు తరలివచ్చిన యువత (ఇన్‌సెట్) అభిమానులనుద్దేశించి మాట్లాడుతున్న పూజ హెగ్డే

సౌత్ ఇండియా షాపింగ్ మాల్‌ను ప్రారంభించిన సినీ నటి పూజా హెగ్డే



సౌత్ ఇండియా షాపింగ్ మాల్‌లో మీడియాతో మాట్లాడుతున్న పూజ హెగ్డే

కడప కార్పొరేషన్: యువనటి పూజా హెగ్డే కడపలో తళుక్కుమన్నారు. నగరంలోని ఆర్టీసీ బస్టాండు సమీపంలో పటేల్ రోడ్డు వద్ద సౌత్ ఇండియా షాపింగ్ మాల్ ప్రారంభించేందుకు బుట్టబొమ్మ వచ్చింది. పూజను చూసేందుకు అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. తాను నటించిన సినిమా పాటలకు స్టెప్పులు వేసి అభిమానులను అలరించారు.యువకుల కేరింతలు, ఈలలతో ఆ ప్రాంతం సందడిగా మారింది. కమలాపురం శాసనసభ్యులు పి. రవీంద్రనాథ్‌రెడ్డి, ఏపీఎస్ఆర్‌టీసీ చైర్మన్ ఏ. మల్లికార్జునరెడ్డి, డిప్యూటీ మేయర్ ముంతాజ్‌బేగం, 13వ డివిజన్ కార్పొరేటర్ ఎం.రామలక్ష్మణ్‌రెడ్డిలు విశిష్ట అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా పూజహెగ్డే మాట్లాడుతూ కడప ప్రజలు తనపై చూపిన ప్రేమాభిమానాలను మరిచిపోలేనన్నారు. కమలాపురం ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ వరలక్ష్మి వ్రతం పండుగ రోజు సౌత్ ఇండియా షాపింగ్ మాల్ ప్రారంభం కావడం సంతోషదాయకమన్నారు. సౌత్ ఇండియా షాపింగ్ మాల్ డైరెక్టర్ సురేష్ సీర్ల మాట్లాడుతూ షాపింగ్ మాల్ కడపలో ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్‌లు పీవీఎస్ అభినయ్, రాకేష్, కేశవ్, ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు చైర్మన్ పులి సునీల్ కుమార్, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు పాకా సురేష్ కుమార్ పాల్గొన్నారు.

వేమన.. ఘన పరిశోధన

యోగివేమన విశ్వవిద్యాలయం పరిశోధనల్లో మేటిగా నిలుస్తోంది.. పరిశోధకులు రాసిన పబ్లికేషన్స్ ప్రచురితమైన జర్నల్స్, వాటిని తిలకించే వారి సంఖ్య ఆధారంగా పరిశోధనలకు సంబంధించిన విలువను తెలియజెప్పే 'హెచ్' ఇండెక్స్ ఆధారంగా వర్సిటీకి ప్రపంచవ్యాప్తంగా పరిశోధనల్లో4010 స్థానంలో నిలువగా, భారతదేశంలో 269వ స్థానంలో నిలిచింది.

- దేశంలోనే 269వ స్థానంలో నిలిచిన విశ్వవిద్యాలయం
- ప్రపంచవ్యాప్తంగా 4010వ స్థానం
- ఏడీ సైంటిఫిక్ ఇండెక్స్ జాబితా విడుదల



వైవీయూలో పరిశోధనలు

వైవీయూ : అమెరికాకు చెందిన ప్రసిద్ధ పరిశోధక సంస్థ ఏడీ సైంటిఫిక్ ఇండెక్స్ తాజాగా జారీ చేసిన సైంటిస్ట్ ర్యాంకింగ్‌లోనూ, విశ్వవిద్యాలయాల ర్యాంకింగ్‌లో యోగివేమన విశ్వవిద్యాలయం మేటిగా నిలుస్తోంది. ఏడీ సైంటిఫిక్ ఇండెక్స్ వరల్డ్ సైంటిస్ట్స్ ర్యాంకింగ్-2023 ప్రకారం ప్రపంచంలోని 19,526 విశ్వవిద్యాలయాల్లో వైవీయూ 4010 స్థానంలోను, ఆసియాలోని 10,121 విశ్వవిద్యాలయాల్లో 1282వ స్థానంలోను, భారతదేశంలోని 3621 విశ్వవిద్యాలయాల్లో 269వ స్థానంలో నిలిచింది. విశ్వవిద్యాలయంలోని అధ్యాపకులు, ఆచార్యులు చేస్తున్న పరిశోధనలకు సంబంధించిన వ్యాసాలు, పరిశోధక పత్రాలు వివిధ జర్నల్స్‌లో ప్రచురితం కావడంతో పాటు వాటిని వీక్షించే సంఖ్య ఆధారంగా ఇచ్చే 'హెచ్' ఇండెక్స్ ఆధారంగా ఈ ర్యాంకింగ్ కేటాయించారు. కాగా యోగివేమన విశ్వవిద్యాలయం హెచ్ ఇండెక్స్‌లో చక్కటి పాయింట్లతో అంతర్జాతీయస్థాయిలో చోటు దక్కించుకోవడం పట్ల వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

టాప్-10 సైంటిస్ట్‌ల జాబితాలో చోటు..

వరల్డ్ సైంటిస్ట్ అండ్ యూనివర్సిటీ ర్యాంకింగ్-23 ప్రకారం ప్రపంచంలోని టాప్-10 శాతం శాస్త్రవేత్తల జాబితాలో వైవీయూకు చెందిన నానోటెక్నాలజీ విభాగం అధ్యాపకుడు ఆచార్య ఎంవీ శంకర్‌కు చోటు దక్కింది. హెచ్ ఇండెక్స్ స్కోరు 43తో ఈయన వైవీయూలో నంబర్ పరిశోధక స్థానంతో పాటు ఇండియాలో ఓవరాల్‌గా 999వ స్థానంలోనూ, ఆసియాలో 10794వ స్థానం, ప్రపంచవ్యాప్తంగా 88,247వ స్థానంలో నిలిచాడు. దీంతో పాటు హార్వర్డ్ విశ్వవిద్యాలయం, స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో జారీ చేసిన ఉత్తమ పరిశోధకుల జాబితాలో సైతం ఈయన గతంలో చోటు దక్కించుకున్న విషయం తెలిసిందే. కాగా ఈయనకు జాతీయ, అంతర్జాతీయస్థాయిలో 6 పేటెంట్‌లు ఉండటం విశేషం.

వైవీయూ టాప్-10 పరిశోధకులు



ఆచార్య ఎం.వి.శంకర్

1. ఆచార్య ఎం.వి. శంకర్ (నానోటెక్నాలజీ)
2. డా. కె.ఎస్.వి. కృష్ణారావు (కెమిస్ట్రీ)
3. డా. ఎల్. సుబ్రమణ్యంశర్మ (కెమిస్ట్రీ)
4. ఆచార్య ఎల్. వీరాంజనేయరెడ్డి (బయోటెక్నాలజీ)
5. డా. వి. రామకృష్ణ (బయోటెక్నాలజీ అండ్ బయోఇన్ఫర్మాటిక్స్)
6. డా. సి. మాధవరెడ్డి (బయోటెక్నాలజీ అండ్ బయోఇన్ఫర్మాటిక్స్)
7. డా. కె. వెంకటేశ్వర్లు (కెమిస్ట్రీ)
8. వి. నవకోటేశ్వరరావు (నానోటెక్నాలజీ)
9. ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య (ఫిజిక్స్)
10. డా. ఎన్. వెంకటరామిరెడ్డి (జువాలజీ).

శాంతిభద్రతలకు టీడీపీ విఘాతం కలిగిస్తోందని ఫిర్యాదు



ఎస్‌ఐ జయరాముడుకు ఫిర్యాదు చేస్తున్న వైఎస్ఆర్ సీపి సోషల్ మీడియా, వైఎస్ఆర్‌సీపీ నాయకులు

కడప అర్బన్: రాష్ట్రంలో శాంతిభద్రతలకు టీడీపీ విఘాతం కలిగిస్తోందని వైఎస్సార్‌సీపీకి చెందిన పలు విభాగాల నాయకులు శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లలో ఫిర్యాదు చేశారు. కడప జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ టి.నిశాంత్, కడప నియోజకవర్గం సోషల్ మీడియా కన్వీనర్ బి.సునీతారెడ్డి, కడప నగర మహిళా అధ్యక్షురాలు టి.పి.సబ్బమ్మ, కో కన్వీనర్ ముదస్సర్, వైఎస్ఆర్‌టీయూసీ నగర అధ్యక్షుడు నాగరాజు నగరంలోని వన్‌టౌన్, టూటౌన్, చిన్నచౌక్, రిమ్స్ పోలీస్‌స్టేషన్‌లలో పోలీసు అధికారులకు ఫిర్యాదులు ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ మంత్రి నారా లోకేష్ రెండు రోజుల క్రితం, అంతకు ముందు పాదయాత్రలో టీడీపీ శ్రేణులను రెచ్చగొట్టేలా ప్రసంగాలు చేశారని పేర్కొన్నారు. 2019 నుంచి 2024 వరకు ఏ కార్యకర్త మీద ఎక్కువ కేసులు వుంటాయో వారికి నామినేటెడ్ పదవులు ఇస్తామని ఆయన చెప్పడం దేనికి సంకేతం అన్నారు. రాష్ట్రంలో అల్లర్లు సృష్టించే విధంగా ప్రేరేపిస్తున్నారని అన్నారు. అందులో భాగంగా తంబళ్లపల్లె, పుంగనూరు, మాచర్ల నియోజక వర్గాల్లో గొడవలు చేస్తున్నారన్నారు. రానున్న రోజుల్లో ఇది ఇంకా ఎక్కువగా ప్రమాదం వుంది కాబట్టి దయచేసి తమ ఫిర్యాదును పరిగణనలోకి తీసుకోవాలని వారు కోరారు.

క్లుప్తంగా

హాకీలో జిల్లా ఎలక్ట్రిసిటీ క్రీడాకారుల ప్రతిభ



వైఎస్సార్ జిల్లా ఎలక్ట్రిసిటీ బోర్డ్ క్రీడాకారులు

కడప కార్పొరేషన్ : ఆల్ ఇండియా ఎలక్ట్రిసిటీ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో కాకినాడలో ఈ నెల 22 నుంచి 25 వరకు హాకీ టోర్నమెంట్ నిర్వహించారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన హాకీ జట్లు పాల్గొన్నాయి. ఈ టోర్నమెంట్‌లో కలకత్తా మొదటి స్థానం, తమిళనాడు ద్వితీయ స్థానం సాధించగా, ఆంధ్రప్రదేశ్ తృతీయ స్థానం సాధించింది. ఏపీ ఎలక్ట్రిసిటీ బోర్డ్ జట్టులో వైఎస్సార్ జిల్లాకు చెందిన క్రీడాకారులు మీరావలి, కరీం, రామక్రిష్ణ, శివ, శ్రీధర్ పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరిచి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

పులివెందుల రూరల్ : పులివెందుల పట్టణ పరిధి ఏపీకార్ల్ వెనుక వైపు సమీపంలోని గుట్టల్లో శుక్రవారం సాయంత్రం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. సంఘటన స్థలానికి ఎస్ఐ హుస్సేన్ చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతదేహం గుర్తు పట్టలేని పరిస్థితుల్లో ఉందని ఎస్ఐ తెలిపారు.

ఆర్టీసీ బస్సు, బైక్ ఢీకొని..

– మహిళ మృతి, ఇద్దరికి గాయాలు

పీలేరు రూరల్ : ఆర్టీసీ బస్సు, బైక్ ఢీకొని ఓ మహిళ మృతి చెందగా, మరో ఇద్దరు గాయపడ్డారు. ఈ సంఘటన పీలేరులోని తిరుపతి రోడ్డు మార్గంలో శుక్రవారం జరిగింది. వివరాలిలా వున్నాయి. పీలేరు మండలం మేళ్లచెరువు పంచాయతీ చెన్నప్పగారిపల్లెకు చెందిన విజయలక్ష్మి (33), నల్లగుట్టపల్లెకు చెందిన జి.మీనాక్షి (22), పీలేరు పట్టణం కోటపల్లెకు చెందిన కవిత (30) ద్విచక్రవాహనంలో తిరుపతి రోడ్డులో కూలీ పనికి బయలుదేరారు. తిరుపతి నుంచి హిందూపురం వెళుతున్న ఆర్టీసీ బస్సు, ద్విచక్రవాహనం శశి హాస్పిటల్ సమీపంలో ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో వారు ముగ్గురూ తీవ్రంగా గాయపడ్డారు. బాధితులను సమీపంలోని శశి హాస్పిటల్‌కు తరలించారు. చికిత్స పొందుతూ విజయలక్ష్మి మృతి చెందింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమణ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మామ,అల్లుడి దుర్మరణం

- బైక్‌ను ఢీకొన్న మినీలారీ
- ఎర్రగుంట్ల వద్ద ఘటన
- మృతులు ప్రొద్దుటూరు వాసులు





మృతి చెందిన బత్తల వెంకటేశ్వర్లు





మృతి చెందిన గజ్జా విజయభాస్కర్

ఎర్రగుంట్ల/ప్రొద్దుటూరు క్రైం : రోడ్డు ప్రమాదం రెండు కుటుంబాల్లో తీవ్ర విషాదం నింపింది. మామ, అల్లుడు మరణించడంతో వారిని నమ్ముకున్న వారు దుఃఖ సాగరంలో మునిగారు. ఎర్రగుంట్ల మండల పరిధిలోని ఎర్రగుంట్ల–ప్రొద్దుటూరు రోడ్డుపై గురువారం అర్ధరాత్రి సమయంలో బైక్‌ను మినీలారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్ పై వస్తున్న ప్రొద్దుటూరులోని హోమస్‌పేటకు చెందిన బత్తల వెంకటేశ్వర్లు (70), గజ్జా విజయభాస్కర్ అక్కడికక్కడే మృతి చెందారు. బాధిత కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బత్తల వెంకటేశ్వర్లుకు భార్య సుందరమ్మతోపాటు జగన్‌మోహన్ అనే కుమారుడు, కరుణమ్మ, రూతు, కెజియా అనే ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఆయన తన సోదరులతో కలసి కొన్నేళ్ల క్రితం శివాలయం వీధిలో రాజధాని పేరుతో ఒక హోటల్‌ను ఏర్పాటు చేశాడు. ఈ హోటల్ ద్వారా పరిసర ప్రాంతాలతోపాటు జిల్లా వ్యాప్తంగా పలువురికి సుపరిచితుడయ్యాడు. తన కుమార్తె కెజియాను సొంత మేనల్లుడైన గజ్జా విజయభాస్కర్‌కు ఇచ్చి వివాహం చేశాడు. విజయభాస్కర్ ప్రొద్దుటూరులోని పోస్టల్‌శాఖలో సౌత్ సబ్‌డివిజన్ మెయిల్ ఓవర్‌సీర్‌గా పని చేస్తున్నాడు. ఆయనకు భార్య కెజియాతోపాటు ఏంజిలినామెర్సీ, ఖయాజ్, అజయ్ అనే పిల్లలున్నారు.

విక్రయించిన స్థలం డబ్బు కోసం వెళ్తుండగా..

బత్తల వెంకటేశ్వర్లుకు కర్ణాటక రాష్ట్రంలోని హుబ్లీలో సొంత స్థలం ఉండేది. ఆ స్థలాన్ని ఇటీవల అక్కడే ఉన్న వేరొకరికి విక్రయించాడు. స్థలానికి సంబంధించి అగ్రిమెంట్ చేసుకొని డబ్బు తెచ్చుకునేందుకు ఆయన గురువారం రాత్రి హుబ్లీకి బయలుదేరాడు. ప్రొద్దుటూరు నుంచి ఎర్రగుంట్లకు బైక్‌లో వెళ్లి అక్కడి నుంచి రైలులో హుబ్లీకి వెళ్లాల్సి ఉంది. తన అల్లుడు విజయభాస్కర్‌ను వెంట తీసుకొని బైక్‌లో ఆయన ఎర్రగుంట్లకు బయలుదేరాడు. మరో 5 నిమిషాల్లో ఎర్రగుంట్లకు చేరుకుంటారనే లోపే రోడ్డు ప్రమాదం వారిని కబళించింది. ఎర్రగుంట్ల పరిధిలోని ప్రొద్దుటూరు రోడ్డులో ఉన్న భవానివేర్ హౌస్ గోడౌన్ సమీపంలో వెళ్తుండగా ఎదురుగా వేగంగా వస్తున్న మినీ లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో బత్తల వెంకటేశ్వర్లు, గజ్జా విజయభాస్కర్ తీవ్రంగా గాయపడి, అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలుసుకున్న వెంటనే సంఘటన స్థలాన్ని ఎర్రగుంట్ల ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ పరిశీలించారు. మినీలారీని పోలీసులు పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. మినీలారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాలను ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతులిద్దరూ పలువురికి పరిచయం ఉన్న వ్యక్తులు కావడంతో ప్రొద్దుటూరులోని హోమస్‌పేటలో విషాదం నెలకొంది. పోస్టుమార్టం అనంతరం పోలీసులు ఇరువురి మృతదేహాలను శుక్రవారం బంధువులకు అప్పగించారు. వారి మృతదేహాలను చూసిన కుటుంబ సభ్యులు, బంధువులు బోరున విలపించారు. పట్టణంలోని పలువురు ప్రముఖులు, పోస్టల్‌శాఖ ఉద్యోగులు జిల్లా ఆస్పత్రికి వచ్చి మృతదేహాలను సందర్శించి నివాళులు అర్పించారు.

పెళ్లికి క్యాటరింగ్ చేసేందుకు వెళ్తూ..

- కొండను ఢీకొన్న ఐచర్ వాహనం
- ఇద్దరు మహిళలు దుర్మరణం
- 11 మందికి గాయాలు



దెబ్బతిన్న ఐచర్ వాహనం



మృతి చెందిన సుజాత



లక్ష్మి మృతదేహం

చిట్వేలి/రాజంపేట : రైల్వేకోడూరు పట్టణంలో జరిగే వివాహానికి క్యాటరింగ్ చేసేందుకు నెల్లూరు నుంచి వస్తూ ఘోర రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఈ సంఘటనలో ఇద్దరు మహిళలు దుర్మరణం చెందగా, 11 మందికి గాయాలు అయ్యాయి. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. చిట్వేలి పరిధిలోని రాపూరు మూడో ఘాట్ మలుపు వద్ద ఈ ఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. బాధితులు, పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నెల్లూరు పట్టణం, సమీప ప్రాంతాలలోని గ్రామాలకు చెందిన 15 మంది వివాహానికి క్యాటరింగ్ చేసేందుకు ఐచర్ వాహనంలో నెల్లూరు నుంచి బయలుదేరారు. ఐచర్ వాహనం రాపూరు ఘాట్ రోడ్డు మూడో మలుపు వద్దకు రాగానే.. బ్రేక్ ఫెయిల్ కావడంతో డ్రైవర్ అదుపుచేయలేక కొండను ఢీకొట్టాడు. దీంతో వాహనంలో పయనిస్తున్న సుజాత (52), లక్ష్మి (37) అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదంలో గాయపడ్డ 11 మందిని రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. వారిలో నాగమణి, మరో మహిళ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం కడప రిమ్స్ ఆసుపత్రికి 108 వాహనంలో తీసుకెళ్లారు. చనిపోయిన వారిలో నెల్లూరు బీవీ నగర్‌కు చెందిన సుజాత (52), నెల్లూరుకు చెందిన లక్ష్మి(37)గా గుర్తించారు. ఈ ప్రమాదంలో ఐచర్ వాహనం డ్రైవర్ భాస్కర్, కాంట్రాక్టర్ ఎటువంటి గాయాలు కాకుండా బయటపడ్డారు. గాయపడిన వారిలో నెల్లూరు వెంకటేశ్వరపురానికి చెందిన పెసలభాస్కర్, సంఘం మండలం వంగలమర్రిపాడుకు చెందిన పొట్లూరి సునీత ఉన్నారు. వాహనంలో మొత్తం 15 మంది ఉన్నారు. ఇందులో 11 మంది మహిళలు , నలుగురు పురుషులు ఉన్నారు. నెల్లూరు సమీపంలో పలు ప్రాంతాల నుంచి వారు కావడంతో గుర్తింపు ఇబ్బందికరంగా మారింది. సంఘం, ఆలూరు, నెల్లూరు టౌన్ ప్రాంతీయులుగా గుర్తిస్తున్నారు. స్థానికుల సాయంతో పోలీసులు క్షతగాత్రులకు సహాయం అందించారు.

అత్తింటివారి వేధింపుల నుంచి కాపాడండి

మదనపల్లె : 'ఫేస్‌బుక్ పరిచయం కాస్తా ప్రేమగా మారి పెళ్లిచేసుకున్న భర్త.. రెండో పెళ్లి చేసుకుని తనను వదిలించుకునేందుకు అత్తింటి వారితో కలిసి వేధింపులకు గురి చేస్తున్నాడు' అంటూ ఓ వివాహిత ఆవేదన వ్యక్తం చేసింది. ఆమె ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం విలేకరులతో తన గోడు వెల్లబోసుకుంది. హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్న తనకు 2017లో మదనపల్లెకు చెందిన మోడెంస్వామికొండ పరిచయమైనట్లు శిరీషా తెలిపింది. అనాథనైన తనను ఇష్టపడి కులాంతర ప్రేమ వివాహం చేసుకున్నాడని, నాలుగేళ్లు బెంగళూరులో కాపురం చేశామని చెప్పింది. 2021లో తన తండ్రి ఆరోగ్యం బాగోలేదని, మదనపల్లెకు వెళ్లి కుటుంబసభ్యులతో కలిసి ఉందామని చెప్పి ఇక్కడకు తీసుకువచ్చిన భర్త వేధింపులకు గురిచేస్తున్నాడని వాపోయింది. అత్తింటివారు వరకట్నం కావాలనే సాకుతో ఇబ్బందులు పెట్టేవారని తెలిపింది. బిగ్‌బాస్ షోకు వెళితే డబ్బులు వస్తాయని నమ్మించి తనపై వీడియోలను చిత్రీకరించాడని చెప్పింది. యూట్యూబ్, ఇన్‌స్టాగామ్‌లలో అకౌంట్లు ఓపెన్‌చేయించి వీడియోలు పోస్ట్‌చేస్తే డబ్బులు వస్తాయని, తద్వారా సుఖంగా ఉండవచ్చని చెప్పడంతో కొన్ని వీడియోలు అప్‌లోడ్ చేసినట్లు చెప్పింది. మద్యానికి అలవాటు పడ్డ తన భర్త.. భార్య మానసిక స్థితి సరిగ్గా లేదని ప్రచారం చేస్తున్నాడని వాపోయింది. ఈ క్రమంలో మదనపల్లె టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో వారు కౌన్సెలింగ్ ఇచ్చాక కొన్నాళ్లు బాగాచూసుకుని తిరిగి కొట్టడం చేశాడంది. ఈ క్రమంలో శ్రావణి అనే మహిళను రెండో వివాహం చేసుకుని బెంగళూరులో రహస్యంగా కాపురం పెట్టి తనను వదిలించుకోవాలనే ఉద్దేశంతో విడాకులు ఇవ్వాలని, లేకపోతే చంపేస్తానంటూ బెదిరించడం చేశాడంది. దీంతో అన్నమయ్య జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావుతోపాటుగా జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా 1902కు కాల్‌చేసి చెప్పడంతో డీజీపీ ఆదేశాల మేరకు భర్త, అత్తింటివారు, బంధువైన కుప్పం ఎస్ఈబీ కానిస్టేబుల్ దేవరింటి శ్రీనివాసులుతో కలిపి మొత్తం 9 మందిపై కేసు నమోదు చేసి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారన్నారు.

జిల్లా ఆస్పత్రి సిబ్బందిపై యువకుల వీరంగం

– గాయపడిన మహిళకు తక్షణమే చికిత్స చేయలేదని దౌర్జన్యం

మదనపల్లె : జిల్లా ప్రభుత్వాసుపత్రిలో గురువారం అర్ధరాత్రి పట్టణంలోని గాంధీపురానికి చెందిన యువకులు వీరంగం సృష్టించారు. అత్యవసర విభాగం సిబ్బందిపై దాడికి యత్నించి, అవుట్‌పోస్ట్ ఏఎస్ఐను బెదిరించి దౌర్జన్యం చేశారు. గాంధీపురానికి చెందిన ఓ మహిళ గురువారం అర్ధరాత్రి రోడ్డుప్రమాదంలో గాయపడటంతో ఆమెను.. భర్త, కొంత మంది యువకులు కలిసి జిల్లా ఆస్పత్రికి తీసుకువచ్చారు. ఆస్పత్రి అత్యవసర విభాగంలో రోగి వివరాలను నమోదు చేసుకునేందుకు సిబ్బంది వివరాలు అడిగారు. అయితే వెంటనే చికిత్స చేయకుండా వివరాలు అడుగుతారా? అంటూ వివరాలు చెప్పేందుకు నిరాకరిస్తూ.. అక్కడికి వచ్చిన యువకులు సిబ్బందిపై పరుషపదజాలంతో దౌర్జన్యానికి దిగారు. పరిస్థితి గమనించి అక్కడికి వచ్చిన అవుట్‌పోస్ట్ ఏఎస్ఐ గణపతి సర్దిచెప్పేందుకు ప్రయత్నించగా, ఆయనను బెదిరిస్తూ దౌర్జన్యానికి దిగారు. ఆస్పత్రి సిబ్బంది, ఏఎస్ఐపై దాడికి యత్నించారు. తాము ఓ జాతీయ పార్టీకి చెందిన కార్యకర్తలమని చెబుతూ బెదిరించారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో ఏఎస్ఐ గణపతి టూటౌన్ పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు స్థానిక సెక్యూరిటీ సిబ్బందితో కలిసి.. యువకులను అక్కడి నుంచి పంపేశారు. అర్ధరాత్రి సమయంలో పలుమార్లు సిబ్బందిపై దాడులు జరుగుతున్నాయంటూ ఆస్పత్రి సిబ్బంది ఆవేదన వ్యక్తం చేశారు. జరిగిన ఘటనపై మెడికల్ సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేశామన్నారు. ఈ విషయమై టూటౌన్ సీఐ మురళీకృష్ణ మాట్లాడుతూ.. ఆస్పత్రి సిబ్బంది రాత పూర్వకంగా ఫిర్యాదు చేస్తే దాడికి యత్నించిన యువకులపై కేసు నమోదు చేస్తామన్నారు.

బావిలో పడి వ్యక్తి మృతి

తంబళ్లపల్లె : బావిలో పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం మండలంలో వెలుగుచూసింది. స్థానికుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కలకడ మండలం నడించెర్లకు చెందిన రాఘవేంద్రాచారి(53) శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరంలో ఓ బ్యాంకులో పని చేస్తూ కుటుంబంతో అక్కడే స్థిరపడ్డాడు. ఆయన కొన్నాళ్లుగా మతిస్థిమితం లేక అక్కడక్కడా తిరిగేవాడు. రెండు నెలల క్రితం మండలంలోని కుక్కరాజుపల్లెలో ఉన్న అతని చిన్నాన్న సుబ్బరాజు ఆచారి ఇంటికి వచ్చి అక్కడే ఉంటూ గ్రామంలో తిరిగేవాడు. ఈ క్రమంలో నాలుగు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కుటుంబీకులు అతని ఆచూకీ కోసం వెతికినా కనిపించకపోవడంతో ధర్మవరానికి వెళ్లి ఉంటాడని అనుకున్నారు. అయితే శుక్రవారం నరసింహాస్వామి ఆలయం పక్కన ఉన్న బావిలో మృతదేహం తేలియాడుతుండగా స్థానికులు పోలీసులకు సమాచారం అందజేశారు. ఎస్ఐ ఆదేశాల మేరకు హెడ్‌కానిస్టేబుల్ రవినాయక్, వీఆర్వో శ్రీనివాసులు సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని వెలికితీశారు. పంచనామా నిర్వహించి పోస్టుమార్టం కోసం మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దాడిలో అక్క, తమ్ముళ్లకు గాయాలు

మదనపల్లె : దాడిలో అక్క, తమ్ముళ్లు గాయపడిన సంఘటన శుక్రవారం మదనపల్లెలో జరిగింది. కూరాకులవీధికి చెందిన విష్ణువర్ధన్ భార్య నాజ్నీ(23)కు మెట్రో కాంప్లెక్స్ వద్ద నివాసం ఉన్న చెల్లెలు నస్రీన్.. తన భర్త ఫయాజ్ తాగి కొడుతున్నాడని సమాచారం అందించి రావాలని కోరింది. దీంతో నాజ్నీ తన తమ్ముడు ఇనాయతుల్లా, పిన్ని కుమారుడు విఘ్నేష్‌లతో కలిసి అక్కడికి వెళ్లింది. నస్రీన్‌పై జరుగుతున్న దాడిని అడ్డుకునేందుకు ప్రయత్నించింది. దీంతో ఆవేశానికి లోనైన ఫయాజ్ రాడ్‌తో నాజ్నీ తలపై కొట్టాడు. దీంతో ఆమె తీవ్రంగా గాయపడింది. ఆమెతోపాటు తోడుగా వచ్చిన ఇనాయతుల్లా, విఘ్నేష్‌లపై దాడి చేశాడు. స్థానికులు బాధితులను జిల్లా ఆస్పత్రికి తరలించారు. టూటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధి కోసం వస్తూ.. తిరిగిరాని లోకాలకు..

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



మృతి చెందిన సుభాన్‌బాషా

కమలాపురం : ఓ యువకుడు ఉన్న ఊరు వదిలి.. ఉపాధి కోసం వస్తూ తిరిగిరాని లోకాలకు వెళ్లాడు. చేతికి వచ్చిన కొడుకు మృత్యువాత పడటంతో.. బాధిత కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. కడప–తాడిపత్రి ప్రధాన రహదారిలో కమలాపురం మండల శివారులోని పాపాఘ్ని నదిపై ఉన్న అప్రోచ్ రోడ్డులో శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. నంద్యాల జిల్లా డోన్‌లోని కొండపేటకు చెందిన దూదేకుల సుభాన్ బాషా(19) కొంత కాలంగా అన్నమయ్య జిల్లా గాలివీడులో మినరల్ వాటర్ క్యాన్ల ఆటో నడుపుతూ జీవనం సాగించేవాడు. ఈ క్రమంలో ఆయన తన స్వస్థలం నుంచి గాలివీడుకు ద్విచక్ర వాహనంపై బయలు దేరాడు. శుక్రవారం తెల్లవారుజామున మార్గంమధ్యలో కమలాపురం సమీపంలోని పాపాఘ్ని నదిపై ఉన్న అప్రోచ్ రోడ్డుపై గుర్తు తెలియని వాహనం ఢీకొని వెళ్లిపోయింది. ఈ ఘటనలో సుభాన్ బాషా తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న 108 సిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని బాధితుడిని కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాగా మృతునికి తల్లి, తండ్రి, సోదరుడు, సోదరి ఉన్నట్లు తెలిసింది. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చిన్నపెద్దయ్య తెలిపారు.

పాత ఐరన్ షాపులపై విజిలెన్స్ దాడులు



ఐరన్ స్క్రాప్ షాపు తనిఖీల్లో పాల్గొన్న విజిలెన్స్ అధికారులు

కడప అర్బన్ : కడప నగరంలోని పాత ఐరన్ షాపులపై కడప రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి షేక్ మాసుంబాషా ఆదేశాల మేరకు విజిలెన్స్ అధికారులు రెండు టీంలుగా ఏర్పడి దాడులు నిర్వహించారు. వినాయకనగర్‌లోని శ్రీ వై.ఎం.ఎంటర్ ప్రైజెస్, శ్రీ గురుసాయి ఎంటర్ ప్రైజెస్, ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లో భారత్ ఐరన్ వర్క్స్, ఆర్టీసీ బస్టాండ్‌లో నాయక్ ఐరన్ స్క్రాప్ షాపులను శుక్రవారం తనిఖీ చేశారు. ఇందులో కడప విజిలెన్స్ అధికారులతోపాటు వివిధ డిపార్ట్‌మెంట్ అధికారులైన సేల్ టాక్స్ ఆఫీస్‌లో ఏసీటీఓగా పని చేస్తున్న ఎం.శ్రీనివాసమూర్తి, కార్మికశాఖ అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ కె.మునిస్వామి పాల్గొన్నారు. ఈ షాపుల్లో ఐరన్ స్క్రాప్స్‌నకు సంబంధించిన క్రయవిక్రయాలు, జీఎస్టీ చెల్లింపుల రిజిస్టర్లు, కార్మికుల హాజరు పట్టిక, ఇతర లోటుపాట్లను పరిశీలించారు. ఈ తనిఖీలలో ఇన్‌స్పెక్టర్స్ పి. రామకృష్ణ, ఇతర అధికారులు జి.శ్రీనివాసులు, వి.అశోక్‌కుమార్, హెడ్‌కానిస్టేబుల్ ఎస్.జనార్దన్‌రావు, రెండవ టీం అధికారులు ఇన్‌స్పెక్టర్ జి.ఈదురు బాషా, ఏఓ ఈ బాలగంగాధర్‌రెడ్డి, ఏఈఈ కేవీ కిషోర్, కానిస్టేబుల్ డి.రంతుబాషా పాల్గొన్నారు. జీఎస్టీకి సంబంధించిన రికార్డులు, రిజిస్టర్‌లు, ఇతర విభాగాల రిజిస్టర్‌లు సక్రమంగా నిర్వహించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కడప రీజినల్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి షేక్ మాసుంబాషా హెచ్చరించారు.

ఆర్టీసీ ఆదాయం పెంచాలి



ఆర్టీసీ జిల్లా మేనేజర్ జనార్దన్‌కు ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న ఈడీ వెంకటేశ్వరరావు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీ కడప జోన్ పరిధిలో పని చేస్తున్న అధికారులు, సిబ్బంది సంస్థ ఆదాయం పెంచడానికి కృషి చేయాలని కడప జోన్ ఈడీ గిడుగు వెంకటేశ్వరరావు సూచించారు. శుక్రవారం తన కార్యాలయంలో ఆయన జోనల్ అధికారులతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఈడీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేశారని, అందుకు బాధ్యతగా ప్రతి ఒక్కరూ ఆదాయం పెంపునకు నడుం బిగించాలన్నారు. జోన్‌లో కార్గో ఆదాయం పెంచినందుకు కృతజ్ఞులు తెలియజేస్తున్నామని, అందుకు తగ్గట్టుగా రానున్న కాలంలో కూడా ఆదాయం తగ్గకుండా ప్రణాళికలు రూపొందించాలన్నారు. కావలి డిపో మేనేజర్‌గా శ్రీహరి ఉన్నప్పుడు డిపో అభివృద్ధికి ఎంతగానో పాటుపడ్డారని, అటువంటి వారిని స్ఫూర్తిగా తీసుకుని పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జోనల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అద్దె బస్సు యజమానుల సమస్యలు పరిష్కరించాలి

ఏపీఎస్ ఆర్టీసీ అద్దె బస్సుల యాజమానుల సమస్యలను ఆయా డిపోల మేనేజర్లు తక్షణమే పరిష్కరించాలని కడప జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిడుగు వెంకటేశ్వరరావు ఆదేశించారు. ఆర్టీసీ రీజినల్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా ప్రజా రవాణాధికారి గోపాల్‌రెడ్డి అధ్యక్షతన కడప రీజియన్ పరిధిలోని డిపో మేనేజర్లు, అద్దె బస్సుల యజమానులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఈడీ మాట్లాడుతూ అద్దె బస్సుల డ్రైవర్లు ప్రయాణికుల పట్ల మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలన్నారు. సమయ పాలనతో సర్వీసు చేస్తూ ప్రయాణికులు చేయి ఎత్తినచోట బస్సు ఎక్కేందుకు, కోరిన చోట దిగేందుకు ఆపాలన్నారు. మద్యం సేవించి విధులకు రాకూడదన్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ అల్లాబకష్, ఇన్‌చార్జి అకౌంట్ ఆఫీసర్ మధుసూదన్‌రావు, అద్దె బస్సులకు సంబంధించిన జూనియర్ అసిస్టెంట్ ఎన్ ఆర్ శేఖర్, వివిధ డిపోల అద్దె బస్సుల యజమానులు, డిపో మేనేజర్లు పాల్గొన్నారు.

క్రీడా ప్రతిభా అవార్డుకు పాఠశాలల ఎంపిక



క్రీడాప్రతిభా పురస్కారాల జాబితాను విడుదల చేస్తున్న డీఈఓ, ఎస్‌జీఎఫ్ కార్యదర్శి

కడప స్పోర్ట్స్ : జిల్లాలో అత్యుత్తమ క్రీడా ప్రతిభ కనబరిచిన పాఠశాలలకు క్రీడా ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేయనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి వై.రాఘవరెడ్డి తెలిపారు. శుక్రవారం కడప నగరంలోని డీఈఓ కార్యాలయంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి బి.అరుణకుమారితో కలిసి క్రీడా ప్రతిభా పురస్కారాలకు ఎంపికైన పాఠశాలల జాబితాను ఆయన ప్రకటించారు. 2022–23 విద్యాసంవత్సరానికి గాను పాఠశాలల క్రీడా పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 5 పాఠశాలలను ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈనెల 29వ తేదీన జాతీయ క్రీడాదినోత్సవం పురస్కరించుకుని ఎంపికైన పాఠశాలలకు క్రీడాప్రతిభా పురస్కారాలను ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీ వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు బి. శివశంకర్‌రెడ్డి, రాయుడు పాల్గొన్నారు.

క్రీడా ప్రతిభా పురస్కారాలకు ఎంపికైన పాఠశాలలు

1. మున్సిపల్ హైస్కూల్ (మెయిన్), కడప
2. జెడ్పీ హైస్కూల్, నల్లపురెడ్డిపల్లి, పులివెందుల
3. జెడ్పీ హైస్కూల్, రామనపల్లి, చెన్నూరు
4. డి.బి.సి.ఎస్.ఎంసీహెచ్ఎస్, ప్రొద్దుటూరు
5. జెడ్పీ హైస్కూల్ (బాలురు), ఎర్రగుంట్ల

సెల్‌ఫోన్ డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న ఆర్ఎం గోపాల్‌రెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆర్టీసీ బస్సుల డ్రైవర్లు ప్రయాణికుల భద్రతను దృష్టిలో పెట్టుకుని సెల్‌ఫోన్ డ్రైవింగ్‌కు దూరంగా ఉండాలని జిల్లా ప్రజా రవాణాధికారి పాలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆర్ఎం కార్యాలయ కాన్ఫరెన్స్ హాలులో డ్రైవర్లు, కండక్టర్లకు పలు అంశాలపై కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికుల పట్ల దురుసుగా ప్రవర్తించరాదన్నారు. అలాగే ర్యాష్ డ్రైవింగ్, మద్యం సేవించి విధులకు హాజరు కావడం తదితర వాటిపై కౌన్సెలింగ్ ఇచ్చారు. డ్రైవర్లు తరుచూ విధులకు గైర్హాజరు కావడం సరికాదన్నారు. ప్రొద్దుటూరు డిపో మేనేజర్ ఎ.మల్లికార్జునరెడ్డి మాట్లాడుతూ డ్రైవర్లు ఇంధనం పొదుపు చేయడంలో అలసత్వం వహించరాదన్నారు. అలాగే ఇంధనం పొదుపు చేయడం ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని పేర్కొన్నారు. అనంతరం రీజినల్ సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్ సుధా కృష్ణారెడ్డి, ప్రొద్దుటూరు డిపో సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్ట్రక్టర్ చిరుకూరి జయానందరావులు డ్రైవర్లకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ డిపోలకు చెందిన డ్రైవర్లు, కండక్టర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీకొన్న బైక్

– ఒకరి మృతి, మరొకరికి గాయాలు



రాజగోపాల్ (ఫైల్)

కురబలకోట/మదనపల్లె : ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి మోటార్ సైకిల్ డివైడర్‌ను ఢీకొనడంతో.. ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. శుక్రవారం వేకువజామున కురబలకోట మండలం ముదివేడు సమీపంలో ఈ సంఘటన జరిగింది. ముదివేడు ఎస్ఐ ముబీన్ తాజ్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గాలివీడు మండలం ఆరవీటివాండ్లపల్లెకు చెందిన బుడ్డారెడ్డెన్న కుమారుడు డి.రాజగోపాల్(54) వృత్తి రీత్యా వ్యవసాయదారుడు. ప్రత్యామ్నాయంగా ఉపాధి కోసం తరచూ బెంగళూరు వెళ్లేవాడు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం అతడి స్నేహితుడు రమణ(47)తో కలిసి ద్విచక్రవాహనంలో బెంగళూరుకు బయలుదేరారు. మార్గమధ్యంలోని కురబలకోట మండలం ముదివేడు సమీపంలో శుక్రవారం వేకువజామున కడప క్రాస్ వద్ద వస్తుండగా ఎదురుగా వాహనం వచ్చింది. దీనికి సైడు ఇచ్చే క్రమంలో మోటార్ సైకిల్ అదుపు తప్పి పక్కనే ఉన్న డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో రాజగోపాల్ తీవ్రంగా, రమణ స్వల్పంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు బాధితులను వెంటనే 108 అంబులెన్స్ వాహనంలో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం రాజగోపాల్ పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం తిరుపతికి రెఫర్ చేశారు. తిరుపతికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరిగి మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. శుక్రవారం పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ముదివేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా మృతుడికి భార్య రత్నమ్మతోపాటు కుమారుడు హరికృష్ణ(సాఫ్ట్‌వేర్ ఉద్యోగి), కుమార్తె అశ్విని ఉన్నారు.